సాక్షి
పల్నాడు
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025




వైభవంగా కల్యాణం

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శనివారం శ్రీ రమా సహిత సత్య నారాయణస్వామి కల్యాణం నిర్వహించారు.



సామూహిక హరినామ జప యజ్ఞం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ కొలనుకొండలో ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం హరినామ జప యజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 546.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రోధనంతో వైభోగం

కూడబెట్టుకున్న రెక్కల కష్టం వస్తుందో లేదో అనే ఆందోళనలో బాధితులు ఒక వైపు.. నమ్మించి వసూలు చేసిన డబ్బుతో కళ్లు చెదిరే పెళ్లి వేడుకలు మరో వైపు.. పిల్ల పెళ్లికి వేసిన చీటీ చేతికందుతుందో లేదో అనే బాధితుల భయం ఒక వైపు.. కొడుకు పెళ్లికి ఎదురు కట్నమిచ్చి చేస్తున్న ఆడంబరాలు మరో వైపు.. నమ్మి నిండా మునిగిన ప్రజల కన్నీళ్లు ఒక వైపు.. ప్రజల సొమ్ముతో సోకులు దిద్దుకున్న కూతురి భవనం మరో వైపు.. ఇదీ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని సాయిసాధన చిట్ ఫండ్ వ్యాపారి పుల్లారావు కొద్ది నెలలుగా సాగించిన ఆర్థిక అరాచకం. పుల్లారావు లీలల్లో మరో కోణం వెలుగులోకి వచ్చింది. ప్రజల కన్నీళ్లను కొడుకు పెళ్లికి కానుకగా మార్చిన ఉదంతం విస్తుగొలుపుతోంది.

ఒక్కోటిగా బయటకు సాయిసాధన చిట్‌ఫండ్ యజమాని లీలలు

- కొడుక్కి ఎదురు కట్నం ఇచ్చి మరీ వివాహం
- రూ. 5 కోట్లతో కోడలికి డైమండ్ హారం
- పెళ్లికి ముందే కోడలి బంధువుల పేరిట పెద్దమొత్తంలో ఆస్తుల బదలాయింపు
- ప్రజల డబ్బులతో ఎడాపెడా దర్జాలు
- పెళ్లి తంతు ముగిశాక కోర్టులో లొంగుబాటు
- లోకేష్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్న బాధితులు

నరసరావుపేట టౌన్: గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏ నలుగురు కూడినా, ఎక్కడ పది మంది మాట్లాడుకున్నా, ఎక్కడైనా పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నా అందరి నోటా.. సాయిసాధన చిట్ ఫండ్ యజమాని పుల్లారావు కథే వినిపిస్తోంది. ప్రజలకు నమ్మకం కలిగించి పుల్లారావు చేసిన ఆర్థిక అరాచకాలు వింటుంటే భీతి కలుగుతోంది. ఇద్దరు చొక్కాల మాటున పాషాణ హృదయాన్ని తలుచుకుంటుంటే ప్రతి ఒక్కరికీ ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఇప్పటికే పుల్లారావు నిర్వహించే సాయిసాధన చిట్‌ఫండ్‌ను పోలీసులు సీజ్ చేయగా, ప్రజల సొమ్ముతో అధునాతన హంగులతో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాన్ని బ్యాంక్ అధికారులు తనఖాలో ఉన్నట్లు తాజాగా బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు పక్కా ప్రణాళికతో ప్రజల డబ్బులు వసూలు చేసిన పుల్లారావు.. ఆ డబ్బులను ఎలా ఖర్చు చేశాడో.. వీటితో ఎలా జల్సాలు సాగించాడో ఒక్కసారి చూద్దాం.

లోకేష్ అయినా న్యాయం చేస్తాడా ?

పుల్లారావు చేసిన మోసంపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎడాపెడా కేసులు నమోదవుతున్నా తమకు భరోసా కల్పించే వారు కరువయ్యారని బాధితులు వాపోతున్నారు. ఇటీవల 40 మంది బాధితులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అయినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించే ప్రజాదర్బార్‌కు సోమవారం వెళ్లాలని బాధితులు నిశ్చయించుకున్నట్లు తెలిసింది. అయితే పుల్లారావుకు తెలుగుదేశం పార్టీ పెద్దల నుంచి అండదండలు ఉండటంతో లోకేష్ అయినా బాధితులకు న్యాయం చేస్తాడా ? లేక తమ పార్టీకి చెందిన వారి తాలూకా అని బాధితులను మభ్య పెడతారా ? అనేది వేచి చూడాల్సి ఉంది.



పుల్లారావు నిర్మించే ఇల్లు బ్యాంక్ తాకట్టులో ఉన్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

ఎదురు కట్నం ఇచ్చి మరీ..



పుల్లారావు కుమారుడు మెడిసిన్ చదువుతున్నాడు. అతను చదువులో మొద్దబ్బాయి అయినప్పటికీ రూ.కోట్లు గుమ్మరించి మెడిసిన్ సీటు తెప్పించుకున్నాడు. పదేళ్లుగా స్టెతస్కోప్ ఎలా పట్టుకోవాలో చేతకాని కుమారుడికి వివాహం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో వైద్య రంగంలో గోల్డ్ మెడల్ సాధించిన ఓ అమ్మాయితో వివాహం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో పెళ్లి కూతురు తరఫువారికి పుల్లారావు భారీగా ఆఫర్ ఇచ్చాడు. మామూలుగా అయితే పెళ్లి కొడుక్కి కట్నకానుకలు ఇస్తారు. కానీ ఇక్కడ పెళ్లి కూతురు తరఫువారికే ఎదురు కట్నం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. రెండు నెలల క్రితం పెళ్లి కూతురు తరఫు బంధువులకు రూ.30 కోట్ల విలువైన ఆస్తులు, నగదు అందజేశాడు. ఎంగేజ్‌మెంట్ రోజున పెళ్లి కుమార్తెకు రూ.5 కోట్ల విలువైన డైమండ్ హారం కానుకగా సమర్పించాడు.



బాధితుల కన్నీళ్లు.. దర్జాగా వేడుకలు

పుల్లారావు అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం తెలిసిన వెంటనే బాధితులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొందరు పోలీసులను ఆశ్రయించారు. పుల్లారావు సమీప బంధువు సీఐ కావడంతో పాటు అధికార పార్టీ అండ ఉండటంతో కేసు నమోదు చేయడంలో పోలీసులు అలసత్వం వహించారు. ఈ క్రమంలో బాధితులు కనిపించిన ప్రతి ఒక్కరి వద్దా కన్నీటి పర్యంతమవుతున్నారు. మరో వైపు ఇటు తనకు డబ్బులిచ్చిన వారు ఆవేదనతో ఉంటే పుల్లారావు మాత్రం తన కుమారుడి పెళ్లి వేడుకలను నిర్వహించాడు. భారీ సెట్టింగులు వేసి, ఆడంబరంగా తిరుపతిలో వారం రోజుల క్రితం పెళ్లి జరిపించాడు. ఒక వైపు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పుల్లారావు ఉదంతం హాట్‌టాపిక్ గా మారినప్పటికీ ఏ మాత్రం లెక్క చేయకుండా దర్జాగా పెళ్లి పనులు నిర్వహించాడు. అనంతరం కోర్టులో లొంగిపోయాడు. దీంతోపాటు మంగళగిరిలో ఉన్న కుమార్తె ఇంటికి సుమారు రూ.2 కోట్లు ఖర్చు పెట్టి ఇంటీరియర్ డెకరేషన్ చేయించాడు. అయితే పుల్లారావు, అతని కుమారుడు కంపెనీ డైరెక్టర్ అయిన పవన్‌కుమార్‌పై కేసులు నమోదై ఉన్నా దర్జాగా పెళ్లి వేడుకలు నిర్వహించడం వెనుక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హస్తం ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుణదల కొండకు ఉత్సవ శోభ

నేటి నుంచి మేరీమాత ఉత్సవాలు



గుణదల(విజయవాడ తూర్పు): మేరీమాత కొలువైన గుణదల కొండ ఉత్సవ శోభను సంతరించుకుంది. వివిధ రకాల పుష్పమాలికలతో అంతరాలయం ముస్తాబైంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో సరికొత్తగా పుణ్యక్షేత్రం పరిసరాలు అన్నీ కాంతులీనుతున్నాయి. మూడు రోజులు కొనసాగనున్న ఉత్సవాలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు గుణదల పుణ్యక్షేత్రం పాలకవర్గం సమష్టిగా కృషిచేస్తోంది. ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు సిబ్బందితో కలసి సమన్వయంగా తిరునాళ్ల నిర్వహణ చేపట్టింది. ఇప్పటికే ఏర్పా ట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కొండ దిగువ నుంచి శిఖరాగ్రం వరకు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాత్రి సమయాల్లో మరియమ్మ కొండ విద్యుత్‌దీపాల కాంతులతో మిరిమిట్లుగొలుపుతోంది.

తిరునాళ్ల సందడి

మేరీమాత పుణ్యక్షేత్రానికి లక్షలాదిగా తరలి వచ్చే యాత్రికులను ఆకట్టుకునేందుకు చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటుచేశారు. రుచికరమైన మిఠాయిలు, బెల్లం చెరకు, ఖర్జూరం వంటి తినుబండారాలను సిద్ధం చేశారు. యాత్రికులను ఆకట్టుకునేలా ఫొటో స్టూడియోలు వెలిశాయి. ఆటవస్తువుల దుకాణాలు, గాజుల అంగళ్ల ఏర్పాటుతో సందడి నెలకొంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

తిరునాళ్లకు హాజరయ్యే భక్తుల కోసం ఉత్సవ కమిటీ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది.

న్యూస్‌రీల్

అభయాంజనేయుడి ఆలయంలో కానుకలు చోరీ



ఉయ్యందన (క్రోసూరు) : మండలంలోని ఉయ్యందన గ్రామంలో ఉన్న అభయాంజనేయస్వామి హుండీ తాళాలు పగులగొట్టి నగదు చోరీ చేసిన సంఘటన శనివారం వేకువజామున జరిగినట్లు స్థానికులు గుర్తించారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. ప్రతి మూడు నెలలకొకసారి హుండీ కానుకలు లెక్కించి భద్రపరిచేవారు. ఈ సారి లెక్కించపోవటంతో హుండీ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న నగదును దుండగులు దొంగిలించారు. సుమారు రూ.25 వేలు వరకు ఉండొచ్చని కమిటీ సభ్యులు తెలిపారు. సీఐ పి.సురేష్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా



పిడుగురాళ్ల: త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చీమకుర్తికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పట్టణంలోని సూర్యకలర్స్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు డ్రైవర్‌కు మాత్రం చిన్నపాటి గాయాలయ్యాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావ్ పరిశీలించారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని చెప్పారు. ముగింపు రోజు సందర్భంగా ఉదయం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి తిరుమంజనం, అష్టోత్తర శతనామార్చన, వేదాశీర్వచనముతో కార్యక్రమాలు ఘనంగా ముగిశాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, వేదపండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీసులో సీపీఎంజీ తనిఖీ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) కె.ప్రకాష్ శనివారం స్థానిక కొత్తపేటలోని ప్రధాన పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.45 గంటల ప్రాంతంలో పోస్టాఫీసుకు చేరుకుని నేరుగా మెయిల్స్ విభాగానికి వెళ్లారు. అక్కడ మెయిల్స్, పార్శిళ్ల వివరాలను తెలుసుకున్నారు. అకౌంట్స్ విభాగాన్ని సందర్శించారు. జీవిత బీమా చాంబర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. నగదు బదిలీలు జరుగుతుండే కౌంటర్లకు వెళ్లారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ట్రెజరీ విభాగాన్ని తనిఖీ చేశారు. డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర బాబు, పోస్ట్‌మాస్టర్ ఈ.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు వెంట ఉన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1,818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

గైడ్ చేసేవారేరీ..?



- ప్రముఖ పర్యాటక ప్రాంతం నాగార్జున కొండలో గైడ్‌ల కొరత
- నాగార్జున కొండ, అనుపులోని చరిత్రను తెలుసుకోలేకపోతున్న పర్యాటకులు
- అవగాహన కల్పించేవారు లేక ఇబ్బందులు



నాగార్జున కొండపై ఉన్న మ్యూజియం


విజయపురిసౌత్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండలో గైడ్ల కొరతతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మధ్యన ఉన్న నాగార్జునకొండ మ్యూజియానికి ఎనలేని ప్రశస్తి ఉంది. వేసవి సెలవులలో ప్రతి విద్యార్థితో పాటు పెద్దలు విజ్ఞానం, విహార యాత్రలో భాగంగా బౌద్ధం పరిఢవిల్లిన నాగార్జున కొండను సందర్శించాల్సిందే. మన దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం ఎందరో యాత్రికులు అనునిత్యం నాగార్జునకొండను సందర్శిస్తారు. చైనా, టిబెట్, భూటాన్, శ్రీలంక తదితర దేశాల వారు ఇక్కడి తథాగతుని ప్రతిమకు ప్రార్థనలు చేస్తుంటారు. అంతటి ప్రాముఖ్యం ఈ నాగార్జునకొండకు ఉంది.

ప్రపంచంలోనే రెండోది..

ప్రపంచంలోనే మానవ నిర్మిత ఐలాండ్‌లో ఈ మ్యూజియం రెండవది. ఇక్కడి శిల్పాలు, గౌతమ బుద్ధుని జీవిత విశేషాలు, బుద్ధుని జాతక కథలు విపులంగా విశదీకరిస్తాయి. ఇవి ఆనాటి శిల్పుల పనితనానికి నిదర్శనాలుగా నిలిచాయి. కొండలో బుద్ధుని ధాతువు దొరికిన మహాస్థూపం, సింహళ విహార్, అశ్వమేధ యాగశాల, మహాచైత్యం ఉన్నాయి. అలాగే ఇక్ష్వాకుల కాలం నాటి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శిథిల అవశేషాలు నాగార్జున కొండ లోయలో ఏ విధంగా ఉన్నాయో అదే విధంగా ఆ ఇటుకలతోనే అనుపు వద్ద పునర్నిర్మించారు. ఇది ప్రాచీన కాలపు గురుకులమై గురుశిష్య నివాసాలు ఒకే దగ్గర ఉండి సలకశాస్త్ర విజ్ఞాన కేంద్రమైన పలు విద్యలలో పేరు పొంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది.

పూర్తి చరిత్ర తెలుసుకోలేక ఇబ్బందులు

ఇంతటి విశిష్టత కలిగిన నాగార్జునకొండ, అనుపులో గైడ్‌లు లేకపోవటంతో ఇక్ష్వాకుల కాలం నాటి రాతి పనిముట్లను, శిల్పాలను, బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను యాత్రికులు తిలకించి సరిపెట్టుకోవాల్సి వస్తుంది. చరిత్ర తెలుసుకోలేకపోతున్నామనే బాధ సందర్శకుల్లో వ్యక్తమవుతుంది. 1988లో స్థానికంగా డిగ్రీ పూర్తి చేసిన 20మంది నిరుద్యోగులకు నాగార్జునసాగర్‌లోని విజయవిహార్‌లో పర్యాటకశాఖ గైడ్ వీరేంద్రతో నెలరోజులు శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్స్‌తో పాటు గుర్తింపు కార్డులను అందజేశారు. అయితే వీరేంద్ర రిటైర్డ్ కాగా శిక్షణ పొందిన 20 మంది గైడ్లలో ఒక్కరు కూడా ప్రస్తుతం అందుబాటులో లేరు. దీంతో పర్యాటకులు కొండ, అనుపులో చారిత్రక విశేషాలను తెలుసుకోలేకపోతున్నారు. పర్యాటకశాఖ, భారత పురావస్తుశాఖ సంస్థలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, నిరుద్యోగులైన స్థానికులకు శిక్షణ ఇచ్చి పర్యాటకుల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



నాగార్జున కొండలోని సింహళ విహార్

నాగార్జునకొండ అత్యద్భుతం

విజయపురి సౌత్: ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ స్థావరం నాగార్జున కొండను సందర్శించిన అంతర్జాతీయ బౌద్ధ బిక్షువులు అక్కడి కట్టడాలు, శిల్పాలను కొనియాడారని పురావస్తు పరిశోధకుడు, ప్లీజ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్ లోని బుద్ధవనంలో ఈ నెల 7న జరిగిన అంతర్జాతీయ త్రిపిటక పఠనోత్సవంలో పాల్గొనేందుకు మన దేశానికి చెందిన 27 మందితో పాటు శ్రీలంక, మయన్మార్, కంబోడియా, లావోస్, థాయిలాండ్, వియత్నాం లాంటి ఇతర దేశాల నుంచి వచ్చిన 88 మంది బౌద్ధ బిక్షువులు విచ్చేశారు. శనివారం వారికి నాగార్జున కొండలోని బౌద్ధ ప్రదర్శనశాల, పునర్నిర్మించిన బౌద్ధ కట్టడాల గురించి శివ నాగిరెడ్డి వివరించారు. బౌద్ధ ప్రదర్శనశాలలోని శిల్పాల గురించి మ్యూజియం అధికారి కమలహాసన్ వివరించగా, బౌద్ధ బిక్షువులు ఆసక్తిగా ఆలకించి ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేలపై తాము కూడా అడుగు పెట్టడం ఎంతో ఆనందాన్నిచ్చిందని, ఆచార్య నాగార్జునని రచనలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయని తెలిపారు.



మ్యూజియంలో బుద్ధుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధ బిక్షువులు





మై'మరిపించేను'!

జనం దృష్టి తన చేనిపై పడనీయకుండా వారి దృష్టిని మరల్చేలా సినీ తారల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడో రైతు. యడ్లపాడు మండలం మైదవోలులోని పోలేరమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పొలాల్లో వ్యాంపు తారలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చూసిన పలువురు రైతు తెలివికి ఆశ్చర్యపోతున్నారు. – యడ్లపాడు

కల చెదిరి.. కన్నీరే మిగిలి..

పదేళ్ల క్రితం కోడలు..ఐదేళ్ల క్రితం కొడుకు మరణించడంతో మనవడు, మనవరాలి బాధ్యతను ఆ వృద్ధ దంపతులు తీసుకున్నారు. వారికి తల్లిదండ్రులు లేని లోటు తెలీకుండా కూలీనాలీ చేసి కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. తమ అవసాన దశలో చేతికందివచ్చిన మనవడు అక్కరకొస్తాడులే అని భావించిన తరుణంలో ప్రమాదంలో మృతిచెందాడని వచ్చిన దుర్వార్త ఆ వృద్ధ దంపతులను హతాశులను చేసింది. కొడుకు, కోడళ్ల మరణాలను తట్టుకుని భరించిన ఆ గుండెలు మనవడి మృతివార్తను మాత్రం తట్టుకోలేక బోరున విలపించాయి.

- పదేళ్ల క్రితం తల్లి.. ఐదేళ్ల క్రితం తండ్రి మృతి
- కూలి పనులకు వెళుతూ మనవడు, మనవరాలిని చదివించిన తాతయ్య
- బెంగళూరులో ఉద్యోగం చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనవడు
- దాచేపల్లి మండలం కేశానుపల్లిలో విషాద ఛాయలు



శ్రీపతి వంశీ (ఫైల్)

దాచేపల్లి: విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం కకావికలమైంది. కొడుకు, కోడలు చనిపోయిన తరువాత చేతికందివచ్చిన మనవడు తమ అవసాన దశలో ఆదుకుంటాడని భావించిన ఆ వృద్ధ దంపతుల ఆశలు అడియాశలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి పేతురు, మార్తమ్మలకు కుమారుడు వంశీ (21), కుమార్తె ప్రియదర్శినిలు ఉన్నారు. తల్లి మార్తమ్మ అనారోగ్య కారణాలతో గత 10 ఏళ్ల క్రితం చనిపోగా తండ్రి పేతురు ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో వంశీ, ప్రియదర్శినిలు తాతయ్య రామకోటయ్య, నాయనమ్మ కమలమ్మల వద్ద ఉండి చదువుకున్నారు. కొడుకు, కోడలు మృతి చెందడంతో వంశీ, ప్రియదర్శినిలలో వారిలో చూసుకుంటూ ఆ వృద్ధులు ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ఇద్దరికి తల్లిదండ్రులు లేని లోటు రానివ్వకుండా తాత కూలి పనులు చేసి మనవడు, మనవరాళ్లను బాగా చదివించాడు. బీఫార్మసీ పూర్తి చేసిన వంశీ గత కొద్ది రోజుల క్రితం బెంగళూరులోని ఒక కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. శనివారం ఉదయం బెంగళూరులో విధులకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద ఘటనను వంశీ స్నేహితులు రామకోటయ్యకు తెలిపారు. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు వంశీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు బెంగళూరుకు వెళ్లారు. వృద్ధాప్యంలో వున్న రామకోటయ్య మనవడు తన జీవిత చరమాంకంలో అండగా ఉంటాడని ఎన్నో ఆశల మధ్య జీవనం సాగించాడు. వంశీ మృతితో రామకోటయ్య పడుతున్న బాధ చూపరుల కళ్లు చెమర్చేలా చేసింది. ఇప్పటివరకు అండగా వుండి తనకు భరోసా కల్పిస్తున్న అన్న వంశీ ఇంక లేడనే విషయాన్ని చెల్లెలు ప్రియదర్శిని జీర్ణించుకోలేకపోతుంది. అందరితో కలిసి మెలసి వుండే వంశీ దుర్మరణం వార్తతో కేసానుపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తిరుపతమ్మ కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాల (పెద్ద తిరునాళ్ల)కు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కనుల పండువగా కొనసాగనున్నాయి. గోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణంతో పాటు 41 రోజుల పాటు మండల దీక్ష చేపట్టిన వేల మంది స్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద అమ్మవారి కల్యాణ వేడుక కోసం 70 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవున విశాలమైన మండపాన్ని ఖమ్మం కళాకారులు నిర్మిస్తున్నారు.

భారీ స్క్రీన్‌లు

11వ తేదీన జరిగే అమ్మవారి కల్యాణ వేడుకను వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. వారి కోసం కల్యాణ మండపం ప్రాంగణంలో పది, ఆలయం చుట్టూ మరో ఐదు భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



తిరుపతమ్మవారి ఆలయం

ఆలయానికి ప్రస్తుతం ఉన్న 62 సీసీ కెమెరాలతో పాటు కల్యాణం రోజున అదనంగా 24, మునేరు అవతల మామిడి తోటలో దీక్షాస్వాములకు అన్నదానం నిర్వహించే చోట మరో ఎనిమిది సీసీ కెమెరాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామని ఈఈ రమ తెలిపారు. అమ్మవారి మామిడి తోటలో దీక్ష విరమించిన స్వాములు సుమారు 25 వేల మందికి అన్నప్రసాదం అందించనున్నారు. ఈ ఏర్పాట్లను ఈఓ కిషోర్‌కుమార్, ఈఈ రమ, ఏఈ రాజు పర్యవేక్షిస్తున్నారు.


క్లుప్తంగా

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్

పట్నంబజారు : భక్తుల రద్దీ దృష్ట్యా కుంభమేళాకు అదనంగా స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. గుంటూరు-2 డిపోకు సంబంధించి ఈనెల 11న ఒక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు అధికంగా రావడంతో ఈ నెల 15న మరో స్పెషల్ హైటెక్ పుష్‌బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గుంటూరు డిపో-2 నుంచి బస్సు బయలుదేరి 8 రోజులపాటు ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా) అయోధ్య, వారణాసి తదితర ప్రాంతాలకు వెళుతుందని తెలిపారు. పది కిలో మీటర్ల లోపు ఉన్న ప్రయాణికుల కోసం బస్సు పంపడం జరుగుతుందన్నారు. రూ. 8,300 ధర నిర్ణయించామని, వసతి, భోజన ఖర్చు ఎవరికి వారే వినియోగించుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 73828 97459, 73828 96403 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ మనశ్శాంతిగా ఉండాలి

మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు



నగరంపాలెం: వ్యాసుడు వలే ప్రతి ఒక్కరూ మనశ్శాంతిగా ఉండాలని, వీలైనంత మౌనంగా ఉండాలని పద్మశ్రీ పురస్కారగ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. పట్టాభిపురం శ్రీరమా సత్యనారాయణస్వామి (48) బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో భారత యుద్ధంలో భగవంతుని పాత్రపై గరికపాటి నరసింహారావు ప్రవచనం చేశారు. అనవసరంగా మాట్లాడవద్దని, అత్యవసరమైతే మాట్లాడాలని తెలిపారు. ఏది అత్యవసరమైతే ఆ పని చేయాలని చెప్పారు. రహదారిపై రూ.లక్ష దొరికితే, దాన్ని రక్షణాధికారికి అందజేయాలని చెప్పారు. సదరు డబ్బును రక్షణాధికారి ఏం చేస్తాడనేది అనవసరమని అన్నారు. కృత యుగంలో దొరికిన నగదు అప్పగించేవారని, కలియుగంలో ఆ పరిస్థితిలేదని తెలిపారు. ఓం నమో భగవతే నమః అంటూ నిద్ర వచ్చే వరకు, మరో ఆలోచన లేకుండా, ఇంకో కరితో మాట్లాడకుండా ఉన్నట్లయితే 24/7 భగవంతుడు మన వద్దనే ఉంటాడని అన్నారు.

వైభవంగా పునీత తోమాసు వారి మహోత్సవం

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో అత్యంత పురాతనమైన పునీత తోమాసు వారి ఉత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థన కార్యక్రమాలలో భాగంగా గుంటూరు మేత్రాసన జూబిలీ గురువర్యులు రెవరెండ్ ఫాదర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, తొలుత జిల్లావ్యాప్తంగా పలు చర్చిల నుంచి వచ్చిన 40 మంది విచారణ గురువులతో దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. 1936 సంవత్సరంలో నిర్మించిన ఈ చర్చిలో అప్పటినుంచి ఇప్పటివరకు సాంప్రదాయబద్ధంగా పూజాబలి కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈసందర్భంగా మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అత్తలూరు తోమాసు చర్చి ఫాదర్ రెవరెండ్ ఫాదర్ చాట్ల కస్పార్ మాట్లాడుతూ అందరూ దైవంపై విశ్వాసంతో తోటి మానవులపై కరుణతో జీవించాలన్నారు. ఏసుప్రభు మానవులకు చేసిన అనేక మంచి కార్యాలకు కృతజ్ఞతగా ఈ పండుగను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఐదు గంటలకు ఒత్తుల సమర్పణ కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో భక్తులంతా వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన తేరుపై ఏసుప్రభువు విగ్రహాన్ని ఉంచి పురవీధులలో బాజా భజంత్రీలతో, బాణసంచాలతో తేరు ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విచారణ గురువులు, మత కన్యలతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మహోత్సవంలో దివ్యపూజాబలి ప్రార్థనలు చేస్తున్న ప్రధాన గురువులు

ఇద్దరు ఘరానా దొంగలు అరెస్ట్?

- పోలీసులను బెదిరించేందుకు ఒకరు ఆత్మహత్యాయత్నం
- స్టేషన్ బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగడంతో ఆస్పత్రికి తరలింపు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో ఇటీవల కుంచనపల్లి, ఉండవల్లి సెంటర్లలో తాళాలు వేసిన ఇళ్లలో భారీ మొత్తంలో బంగారం, నగదు చోరీకి పాల్పడ్డ కేఎల్‌రావు కాలనీ, సీతానగరానికి చెందిన ఇద్దరు యువకుల్ని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి నుంచి కొంత సొమ్ము రికవరీ చేశారు. మిగిలిన వాటి కోసం విచారణ చేస్తున్న క్రమంలో సీతానగరానికి చెందిన ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగిన ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... సీతానగరానికి చెందిన నాగరాజు, దుర్గారెడ్డిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కుంచనపల్లిలో జరిగిన దొంగతనంలో రికవరీ చేసే క్రమంలో దుర్గారెడ్డి పొరపాటున ఉండవల్లి సెంటర్‌లో కూడా తామే దొంగతనాలు చేశామని పోలీసుల వద్ద చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై నాగరాజును, దుర్గారెడ్డిని వేరువేరు చోట్ల ఉంచి ప్రశ్నించారు. నాగరాజు దొంగిలించిన వాటిని ఎక్కడ రికవరీ కింది ఇవ్వాల్సి వస్తుందోనని పోలీసులను బెదిరించేందుకు బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు అతడిని తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నెల రోజుల నుంచి ఫోన్ లొకేషన్ ద్వారా వేల ఫోను నెంబర్లను పరిశీలించి సుమారు రూ.75 లక్షల విలువైన బంగారాన్ని రికవరీ చేసే క్రమంలో ఈ ఘటన జరిగింది. దుర్గారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

వాగులో పడి బీటెక్ విద్యార్థి మృతి

మారేడుమిల్లి: గుంటూరు జిల్లా అమరావతిలో గల ఎస్ ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగులపాటి నాగ మల్లేశ్వరరావు(19) అనే విద్యార్థి వాగులో పడి శనివారం మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలోని పర్యాటక ప్రదేశమైన గుడిసె ప్రాంతాన్ని ఏడుగురు స్నేహితులతో కలిసి అతడు సందర్శించాడు. తిరుగు ప్రయాణంలో ఆకుమామిడికోట సమీపంలోని కాలకృత్యాల కోసం సంగువ వాగులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారి వాగులో పడి మునిగి మృతి చెందాడు. స్నేహితులు, ఆకుమామిడి కోట గ్రామస్తులు, వేజువాడకు చెందిన కొంత మంది గిరిజనులు కలిసి గాలింపు చర్యలు చేపట్టగా యువకుడి మృతదేహం లభ్యమైంది. దీనిపై మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సాదిక్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అద్దంకి రూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, మామ, అత్తలపై వివాహిత ఇచ్చిన ఫిర్యాదు ఎస్సై ఖాదర్‌బాషా శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన యెర్రిబోయిన భూలక్ష్మిని నూజండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన కొనంకి బాల వీరయ్యతో ఐదేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో బాలవీరయ్యకు రూ. 50 వేల నగదు, ఒక ఎకరం భూమి, 20 సవర్ల బంగారం కట్నకానుకల కింద ఇచ్చారు. వీరికి ఒక పాప ఉంది. అదనపు కట్నం తీసుకురావాలని కొంత కాలంగా మామ, అత్త, భర్త తరచూ తిట్టడం, కొట్టడం చేస్తూ వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో భూలక్ష్మి తన పుట్టిల్లు తిమ్మాయపాలెం వచ్చి శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం చీరాల-ఈపూరుపాలెం రహదారిపై జరిగింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదుళ్లపల్లికి చెందిన దాసరి డేనియల్ ప్రసాద్ మరో ఇద్దరు వెదుళ్లపల్లి నుంచి చీరాలకు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈపూరుపాలెం జెడ్పీ బాలుర హైస్కూల్ నీటి పంపు వద్ద నిలిపి ఉంచిన గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దాసరి డేనియల్ ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

నేడు స్కాలర్‌షిప్పులు అందజేత

కొరిటెపాడు: 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు' 'ది రాజోల్ తాలూకా తెలగ అఫీషియల్ అసోసియేషన్ - రాజోలు' సంయుక్త ఆధ్వర్యంలో 242 మంది పేద విద్యార్థులకు రూ. 10.37 లక్షల ఉపకార వేతనాలుగా ఆదివారం పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ. 5.25 లక్షలు తులసి సీడ్స్ వారు 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ' ద్వారా 104 మందికి ఇవ్వనున్నారు. మంగేన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుంది. గౌరవ అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరుకానున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలిపారు.

పకడ్బందీగా నవోదయ పరీక్షలు

- 9,11 తరగతుల్లో ప్రవేశాలకు పరీక్షల నిర్వహణ
- 2065 దరఖాస్తులకు 1448 మంది విద్యార్థులు హాజరు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: పల్నాడు జిల్లా మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల ప్రవేశాలకు అర్హత పరీక్షలు శనివారం జరిగాయి. 2025-26 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో విద్యార్థుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ ప్రవేశ పరీక్షను ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో నిర్వహించినట్లు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. శనివారం జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 2065 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 1448 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. వీరిలో 9వ తరగతి ప్రవేశాలకు 1370 మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్షలకు 962 మంది హాజరయ్యారు. అలాగే 11వ తరగతికి 695 దరఖాస్తులు రాగా వీటిలో 486 మంది మాత్రమే పరీక్షలు రాసినట్లు వెల్లడించారు. ఈ ప్రవేశ పరీక్షలను ఉమ్మడి పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో రెండు సెంటర్లు, చిలకలూరిపేటలో 4, మద్దిరాల నవోదయ విద్యాలయంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. 9వ తరగతి వారికి ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు, 11వ తరగతి వారికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ పర్యవేక్షణలో ఏడుగురు అబ్జర్వర్లు పరీక్షల నిర్వహణ ప్రక్రియను కొనసాగించారన్నారు.



పరీక్షల నిర్వహణ ఓరియంటల్‌పై శిక్షణ

జాతీయస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



బండ లాగుతున్న ఎడ్లు

మాచవరం: అనాది నుంచి తిరునాళ్లలు జరుపుకోవడం సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండులాగుడు బల ప్రదర్శన పోటీలను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఉత్సాహపర్చేందుకు ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ రైతు సేవా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జత పళ్ల విభాగంలో విజేతలు...

వజ్రాల తేజస్వీరెడ్డి (సంతమాగులూరు, బాపట్ల జిల్లా), మోపర్తి నవీన్‌చౌదరి (తక్కెళ్లపాడు, గుంటూరు జిల్లా) కంబైన్డ్ ఎడ్ల జత 3739అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. జువ్వాడ మేఘనానాయుడు (మాదల, ముప్పాళ్ల) 3653.4 అడుగులు, బచ్చిగారి హరికృష్ణ విజయలక్ష్మి నాయుడు (ఆకివీడు, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా) ఎడ్లు 3600 అడుగులు, గుదిబండ శ్రీనివాసరెడ్డి (కొల్లిపర, గుంటూరు) ఎడ్లు 3600 అడుగులు, గౌరు కార్తికేయ (మాచాయపాలెం, బెల్లంకొండ) ఎడ్లు 3291.4 అడుగులు, జల్లి నాగమల్లేశ్వరావు (విస్సప్పాలెం, నర్సరావుపేట) ఎడ్లు 3219.2 అడుగులు, మల్లెబోయిన నాగార్జున (అంకెలరెడ్డిపాలెం, ప్రకాశం జిల్లా) ఎడ్లు 3179.6 అడుగుల దూరాన్ని లాగి వరుస బహుమతులు గెలుచుకున్నాయి.

సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రపతికి లేఖలు

నరసరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు శనివారం లేఖలు రాశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ లేఖలు రాశారు. సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి మాట్లాడుతూ అన్ని ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌చే రాష్ట్రపతికి ఉత్తరాలు రాయించామన్నారు. అవి మొత్తం సోమవారం ఢిల్లీకి రిజిస్టర్ పోస్టు చేస్తామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి, కోశాధికారి ఏఎల్ ప్రసన్న సాయికుమారి, ఎస్‌కే సుజాత, శ్రీదేవి పద్మావతి, అమల పాల్గొన్నారు.



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రపతికి రాసిన లేఖలతో అంగన్‌వాడీలు

కుక్క కరిచినా కనికరించలేదు

డాక్టర్ రాక.. అద్దంకి వైద్యశాలలో గాయాలతోనే గంటల సేపు ఎదురుచూపు

అద్దంకి రూరల్: కుక్క కరిచిన వ్యక్తి గాయాలతో వైద్యశాలకు చేరుకుని డాక్టర్ కోసం మూడు గంటలపాటు ఎదురు చూసిన సంఘటన అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో శనివారం చోటుచేసుకుంది. క్షతగాత్రుడు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న విప్పర్ల వెంకటేశ్వర్లు శనివారం ఉదయం 6 గంటలకు స్థానిక ఎన్ఆర్‌నగర్‌కు వెళ్లాడు. బైకు ఆపి దిగుతుండగా రెండు కుక్కలు వచ్చి దాడిచేసి కాళ్లమీద కరిచాయి. వెంటనే ఇంజక్షన్ చేయించుకునేందుకు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా.. అక్కడ డ్యూటీలో డాక్టర్ లేరని.. వచ్చేవరకు వేచి ఉంటే ఉండాలని.. లేకపోతే పొమ్మని సిబ్బంది, నర్సులు చెప్పారు. డాక్టర్ వచ్చేసరికి 10 గంటలు అయింది. అప్పటివరకు కాలు వెంట రక్తం కారుతున్నా నొప్పిని ఓర్చుకుంటూ వేచి ఉన్నాడు. వైద్యశాలలో నైట్ డ్యూటీ చేసే డాక్టర్, నర్సులు ఉదయం 9 గంటల వరకు పనిచెయ్యాలి.. కానీ డాక్టర్ లేడన్న నెపంతో క్షతగాత్రుడిని పట్టించుకోలేదు.

కేసుల విచారణలో వేగం పెంచాలి

గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ





సమావేశానికి హాజరైన డీఎస్పీలు, సీఐలు

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు సంబంధించి న్యాయస్థానాల్లో నెలకొన్న కేసుల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. కె.సుప్రజ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిందితుల ఆచూకీ తెలియకపోతే వారికి అనుబంధంగా ఉన్న వ్యక్తులను కోర్టుల్లో హాజరుపరచాలని చెప్పారు. హత్య, హత్యాయత్నం, ఎస్‌డీపీఎస్, పోక్సో, అత్యాచార కేసులకు సంబంధించి విచారణ ఆయా కోర్టుల్లో వెంటనే జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి చార్జిషీట్లను కోర్టుల్లో దాఖలు చేశాక పీఆర్‌సీ (ప్రిలిమినరీ రిజిస్ట్రేషన్ కేసు) నంబరు, ఎస్‌సీ (సెషన్స్ కేసు) నంబరు, సీసీ (కోర్టు కేసు) నంబరు సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా న్యాయస్థానాల్లో కేసుల చార్జిషీట్ల దాఖలు, ఎన్‌బీడబ్ల్యూ జారీ, కేసుల విచారణకు అవసరమైన పత్రాల దాఖలుకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు అజీజ్ (తూర్పు), శివాజీరాజు (సీసీఎస్), భానూదయ (దక్షిణ), డీసీఆర్‌బీ సీఐ బి.నరసింహారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

233 దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గీత కులాలకు (గౌడ, గౌడ్‌లకు) రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులు కేటాయించేందుకు కొద్దిరోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణకు శనివారం చివరి రోజు కావడంతో 233 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధికంగా గుంటూరు నగరంలో ఒక్క షాపునకు 44 దరఖాస్తులు అందాయన్నారు.